# ఆరి

మనిషిని పోలిన మనుషులు ఈ భూమ్మీద ఆరుగురో ఏడుగురో ఉంటారట! వుంటే ఉండవచ్చు గాక!

కానీ, కనుముక్కు తీరుతో సహా అచ్చుగుద్దినట్లు ఒకరి పోలికలు మరొకరికి వుంటాయని - ప్రభుని చూసేదాకా రావుగారు అనుకోలేదు.

ప్రభు అచ్చు అరుణ్ పోలికే!

అరుణ్ ఎవరో కాదు, రావుగారికి స్వయానా మనవడు!

'అసలు కంటే వడ్డీ ముద్దు' అంటారు. ఈ సామెతను సాధారణంగా డబ్బు విషయంలో వాడతారు. కాని ఇది నూటికి నూరుపాళ్లూ మమతాను బంధాల విషయంలో సరిపోతుంది. రక్తాన్ని పంచి ఇచ్చే తండ్రీ, పేగు తెంచి ఇచ్చే తల్లీ 'అసలు' లాంటివాళ్లయితే, మధ్యలో 'మాంగల్యబంధం' వల్ల తారసపడే ఇల్లాలూ, ఆ బంధానికి అనుబంధాలై పుట్టే పిల్లలూ 'వడ్డీ' లాంటి వాళ్లై ముద్దు మురిపాలు తీరుస్తారు. మగవాడు ఓ కొడుక్కి తండ్రి అయినప్పుడు పొందే గర్వం కంటే, ఆ కొడుక్కి మరో కొడుకు పుట్టాక - తాను 'తాత' హోదా పొందినప్పుడు అనుభవించే పారవశ్యానికి 'పవరు' ఎక్కువ!

పసితనంలో తమ కొడుకు గుక్కపట్టి ఏడిస్తే, ఏమాత్రం పట్టించుకోని తండ్రులు, తాతలయ్యాక - ఒంట్లో ఓపిక లేకపోయినా సరే, మనవల్ని వీపుమీద ఎక్కించుకుని ముప్పొద్దులా మోస్తారు.

కొడుకు చదువుకునేటప్పుడు, "నాన్నా! పుస్తకం కొనుక్కోవాలి, డబ్బులిస్తావా?" అని అడుగుతాడు. అదే మనవడైతే, "తాతా! నాకు పుస్తకంకావాలి, కొనిపెట్టు" అంటూ ఆజ్ఞాపిస్తాడు.

అలాంటి ఆజ్ఞలో ఏ తాతైనా తన్మయత్వాన్నే పొందుతాడు.

అసలు బంధాల్ని పెంచుకోకూడదని వేదాంతులు చెప్తారు. కానీ అలా పెంచుకోవటం వల్ల లభించే పారవశ్యం వాళ్ళకు తెలియదేమో అనిపిస్తుంది.

నాలుగేళ్ల మనవడు తాత చిటికెనవేలు పట్టుకుని రోడ్డు మీద నడుస్తూ అర్థం పర్థంలేనివే అయినా, అడుగడుక్కీ ప్రశ్నలు వేస్తుంటే ఓపిగ్గా వాటికి సమాధానాలు చెప్పటం ఏ తాతకైనా 'థ్రిల్ల' నిపిస్తుంది!

సాధారణంగా తాతలందరికీ ఏ రోజుకారోజు 'ముదిమి' మీద పడుతూనే ఉంటుంది. నాలుగు గంటలు పనిచేస్తే ఒళ్లు నొప్పులూ - నాలుగడుగులు నడిస్తే కీళ్ళ నొప్పులూ తప్పనిసరి! పగలంతా అలా అలసిపోయి రాత్రి ఏ తొమ్మిదింటికో పక్కమీద వాలితే -

అదిగో, అప్పుడు ఆ నొప్పులన్నీ బయటపడతాయి. "అబ్బా! అయ్యో!" అనుకుంటూ ఆపసోపాలు పడతారు. ఇల్లాల్ని పిలిచి "కాస్తంత కాళ్లు నొక్కవోయ్" అని బతిమాలుతారు. "చాల్లెండి! పొద్దుట్నుంచీ ఒకటే చాకిరీ! ఇప్పుడే నడుం వాల్చాను. ఇక నా వల్ల కాదు!" అటుందావిడ. చెట్టంత కొడుకు ఇంట్లో ఉంటాడు. కానీ వాణ్ని అడగలేరు. వాడంతటవాడుగా వచ్చి వాళ్ల నొప్పులు తీర్చనూలేడు. భార్యముందు సదరు కొడుక్కి నామోషీ కదా! సరిగ్గా అలాంటప్పుడు -

అయిదేళ్లు నిండిన మనవడు - "నే వస్తున్నా తాతా!" అంటూ వచ్చి తన లేలేత అరికాళ్లతో కాళ్లు తొక్కితే ఎంత హాయిగా ఉంటుందో!

అలాగే, తెల్లవారగానే "గుడ్ మార్నింగ్ తాతా! పేపరొచ్చింది, ఇదిగో!" అంటూ నిద్రలేపి పేపరు చేతికందించినప్పుడు కూడా అంత ఆహ్లాదంగానూ ఉంటుంది. ఇవన్నీ ఊహించి రాస్తున్న విషయాలు కాదు...

మా పక్కవాటాలో ఉంటున్న రావుగారిని చూసి రాస్తున్న నిజాలే! రావుగారికి మనవడు అరుణ్ అంటే ప్రాణం. వరుసగా మూడేళ్లు వాడి పుట్టిన రోజు పండుగల్ని మూడు నక్షత్రాల హోటల్లో ఘనంగా చేశారు. అరుణ్‌కి మూడో ఏడు రాగానే మూడు చక్రాల సైకిలు కొన్నారు. ప్రతి దీపావళికీ మూడు వందలకు పైగా ఖర్చు పెట్టి బాణసంచా కొనేవారు. ప్రతి ఉగాదికీ వాళ్ల నాన్న ఖరీదైన బట్టలు కొని తెచ్చినా, మళ్లీ అయిదారు వందలు పెట్టి మరో డ్రెస్సు మనవడికి కొంటే తప్ప, ఆయనకు తృప్తిగా ఉండేది కాదు. మనవడంటే ఆయనకు ఎంత ప్రాణమో, తాతంటే అరుణ్‌కి అంత ఇష్టం. ఎప్పుడైనా అరుణ్ వాళ్ల అమ్మతో ఏ ఊరైనా వెడితే వాడు తిరిగొచ్చేదాకా ఆయనకు తోచేది కాదు. అలాగే అక్కడ అరుణ్ కూడా తాత కోసం బెంగపెట్టుకునేవాడు.

రోజులన్నీ సాఫీగా సాగిపోవు కదా! ఊహించని సంఘటనలు జీవితంలో చోటు చేసుకుంటూ ఆ జీవన గమనాన్ని మలుపు తిప్పుతూంటాయి.

రావుగారబ్బాయి రాఘవకి అమెరికాలో ఉద్యోగం రావటం కూడా అలాంటి సంఘటనే! అందువల్ల అతను కుటుంబ సమేతంగా అక్కడకు వెళ్లిపోయాడు. కన్నకొడుకు దూరంగా వెళ్లిపోతున్నాడన్న వేదనకంటే, అరుణ్ తమకు దూరమవుతాడన్న ఆవేదన రావుగారిని క్రుంగదీసింది.

ఆరోజు - అరుణ్, వాళ్లమ్మా నాన్నతో అమెరికా వెళ్లిపోతున్న రోజు -

ఎయిర్‌పోర్ట్‌లో విమానం దగ్గరకు నడుస్తూ, అడుగడుక్కీ వెనక్కు తిరిగి తాత కోసం ఆరాటంగా వెతికిన చూపుల్ని - ఇవాళ్టికి ఇరవై ఏళ్లు కావస్తున్నా ఆయన మరచిపోలేదు!

అరుణ్ అమెరికా వెళ్లిన తర్వాత వారం వారం తాతగారితో ఫోనులో మాట్లాడు తూండేవాడు. ఆర్నెల్లకోసారి వేర్వేరు సందర్భాల్లో అక్కడ అరుణ్‌కి తీసిన ఫోటోల్ని రాఘవ పంపుతూండేవాడు. అయినా రావుగారికి సంతృప్తి కలిగేది కాదు. రోడ్డు మీద అయిదారేళ్ల వయసులో పిల్లలు ఎవరు తారసపడినా వాళ్లలో అరుణ్ పోలికలు కనిపిస్తాయోమోనని ఆశగా వెతికేవారాయన.

అప్పుడే....

అలా వెతుకుతున్న రోజుల్లోనే హఠాత్తుగా ఆయన 'ప్రభు'ని చూడటం తటస్థించింది.

మనిషిని పోలిన మనిషి ఉంటే ఆండవచ్చునేమోగానీ, కనుముక్కు తీరుతో సహా అన్ని పోలికలూ అచ్చుగుద్దినట్టుగా ఉంటాయని అంతకు ముందు ఎప్పుడూ ఊహించని రావుగారు. అందుకే - ప్రభుని చూసి దిగ్భ్రాంతికి లోనయ్యారు!

ఆరోజు -

అంటే ఇప్పటికి సుమారు పదిహేనేళ్ల క్రితం....! రావుగారు భార్య రాజ్యంతో సహా తాడేపల్లిగూడెం పెళ్లికి వెళ్లి, హైదరాబాద్ తిరిగి వస్తున్నారు. గూడెంలో రైలెక్కి కూర్చున్నారు. ఏదో క్రాసింగ్ ఉండటం వల్ల కాబోలు, బండి వెంటనే కదల్లేదు. రావుగారి సీటుకి ఎదురుగా కిటికీ దగ్గర ఓ పదేళ్ల కుర్రాడు కూర్చున్నాడు. ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఊరుకో, నాన్నా! దీపావళి పండక్కి నేను వస్తానుగా! ఇంకెంత ? పదిహేను రోజులు!" అంటూ కిటికీ అవతల ప్లాట్‌ఫాం మీద నిలబడి ఉన్న ఓ నడివయస్కుడు - ఆ కుర్రాడి తండ్రి కాబోలు - ఓదారుస్తున్నాడు.

అంతలో రాజ్యం అతన్ని అడగనే అడిగింది - "మీ అబ్బాయా?" అని.

"ఔనమ్మా! హైదరాబాద్ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్నాడు. మొన్న దసరా సెలవలకి వచ్చాడు. రేపు స్కూలు తెరుస్తారమ్మా!" చెప్పాడతను.

"ఒక్కడూ వెడుతున్నాడా?" రాజ్యం మళ్లీ ప్రశ్నించింది.

"పక్క కంపార్ట్‌మెంట్‌లో వీడి ఫ్రెండొకడున్నాడమ్మా! వాడు కూడా రెసిడెన్షియల్ స్కూల్లోనే చదువుతున్నాడు. ఆ కుర్రాడి తండ్రి కూడా వస్తున్నాడు. హైదరాబాదులో దిగగానే ఆయన వీళ్లిద్దరినీ తీసుకెళ్లి హాస్టల్లో విడిచిపెడతాడు."

"ఏ తరగతి చదువుతున్నావు బాబు!" ఈ సారి ఆ కుర్రాణ్ని అడిగింది రాజ్యం.

"ఆరో తరగతి చదువుతున్నాడమ్మా! వెధవకి బెంగెక్కువ!" ఆయనే బదులు చెప్పాడు మళ్లీ.

అంతలో రైలు కదిలింది.

"నీ పేరేమిటోయ్?" కొన్ని క్షణాల తర్వాత రావుగారు ప్రశ్నించారు.

"ప్రభు! తారకప్రభు!" వచ్చే దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ రావుగారిని చూసి బదులు చెప్పాడు.

అప్పుడే - సరిగ్గా ఆ క్షణంలోనే ఆయన కుర్రాడివైపు చూశారు. చూసిన తర్వాత చూపుల్ని మరి మరల్చుకోలేక పోయారు.

అవే కళ్లు, అదే నుదురు, అదే గిరజాల జుట్టు... ముక్కు కూడా అచ్చం అలాగే వుంది. ప్రభు ముమ్మూర్తులా తమ మనుమడు అరుణ్‌లాగే ఉన్నాడు.

"హైదరాబాద్‌లో మీకెవరైనా చుట్టాలున్నారా, బాబూ!" రాజ్యం అడిగింది.

లేరన్నట్టు తల అడ్డంగా తిప్పాడు.

"మీది తాడేపల్లిగూడెమేనా?" ప్రభుని ఎలాగైనా మాటల్లో పెట్టి మరపించాలన్న ప్రయత్నంలో అడిగాడు రావుగారు.

"అసలు పాలకొల్లండి మాది. అక్కడ మా డాడీ బిజినెస్ చేస్తారు. నేను సెలవలకు వచ్చినప్పుడల్లా గూడెంవచ్చి నన్ను రిసీవ్ చేసుకుంటారు. మళ్లీ గూడెంలోనే రైలెక్కిస్తారు!" చెప్పాడు ప్రభు.

అంత లేతవయసులో తల్లిదండ్రుల నీడలో అందమైన పూలమొక్కలా పెరగవలసిన పిల్లవాడు అంత దూరం వెళ్లి హాస్టల్లో ఒంటరిగా ఉంటూ చదువుకోవాల్సిన అవసరమేమిటో రావుగారికి అర్థంకాలేదు.

"పాలకొల్లులో మంచి స్కూళ్లు లేవా?" అడిగారు.

ఉన్నాయనట్టు తలూపాడు.

"మరి అంతదూరం ఎందుకు వెళ్ళటం?"

"అక్కడైతే ఇంగ్లీషు మీడియంలో చదువు బాగా చెప్తారు. పన్నెండో క్లాసుదాకా వరసగా అక్కడే చదవచ్చు. పుస్తకాలూ, బట్టలూ అన్నీ వాళ్ళే ఇస్తారు".

"మరి నీకేదైనా - అక్కడ సుస్తీ చేస్తే?" మధ్యలో కలుగుజేసుకుంటూ అడిగింది రాజ్యం.

"మా అందరికీ ఒక డాక్టరుగారున్నారు. ఆయన ప్రతి ఆదివారం హాస్టల్‌కి వస్తారు. ఇంకా అవసరమైతే, మా వార్డెన్ హాస్పటల్లో చేర్పించి వైద్యం చేయిస్తుంది!" చెప్పాడు.

'అన్నీ వాళ్లే చేయగలుగుతారు, కానీ తల్లితండ్రుల ప్రేమను మాత్రం వాళ్లు పంచలేరు కదా!' - అనుకున్నారు రావుగారు మనసులో.

"ఆ స్కూల్లో చదువు అయిపోయిన తర్వాత ఏం చేస్తావు?" అడిగారతన్ని.

"మెడిసిన్ చదువుతాను" ధృడనిశ్చయంతో చెప్పాడు ప్రభు.

"మరి అమ్మకీ, నాన్నకీ అంత దూరంగా ఉంటే నీకు బెంగగా ఉండదా?"

రావుగారడిగిన ఆ ప్రశ్న వినగానే మళ్లీ దుఃఖం పెల్లుబికి రాబోయింది. కానీ, తమాయించుకుని బదులు చెప్పాడు - "అప్పుడప్పుడు ఉంటుంది. కానీ అక్కడ హాస్టల్లో ఫ్రెండ్స్ ఉంటారుగా! అసలు నేను మూడో క్లాసు నుంచీ అక్కడే చదువుకుంటున్నాను."

రావుగారు ఆ మాట విని ఆశ్చర్య చకితులయ్యారు!

అంటే!?

ప్రభు తన ఎనిమిదో ఏట నుంచీ తల్లితండ్రులకు దూరంగానే ఉంటున్నాడన్నమాట! పన్నెండో తరగతి వరకూ హైదరాబాదులోనే చదవటం అంటే - అప్పటికి పదహారేళ్ల వాడవుతాడు. ఆ తర్వాత అక్కడో, మరింత దూరంలోనో అయిదేళ్లు మెడిసిన్ చదువుతాడు. అది పూర్తయ్యాక పెళ్లి, ఉద్యోగం, ... బరువులు, ..... బాధ్యతలూ!

ఇక ప్రభు బాల్యాన్ని ఏమనుభవించినట్టు? దాని తాలూకు అనుభూతులైనా అతని తల్లిదండ్రులకు ఏం మిగిలినట్టు? కన్నవారి ప్రేమానుబంధాల్నీ, మమతానురాగాల్నీ పొందే అవకాశం చిన్నవాడికి ఇవ్వకుండా చదువుల పేరుతో అంతదూరం పంపి, ఒంటరిగా వుంచటం భావ్యమా? అసలు అవసరమా?

అలా ఎన్నో ఆలోచనలు రావుగారిని ముసురుకున్నాయి. రైలు వేగంగా వెడుతోంది. ఆయన అలా ఆలోచిస్తూనే, ఉండి ఉండి ప్రభు వైపు చూస్తున్నారు. తల్లిదండ్రుల ఎడబాటు వల్ల వస్తున్న దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నం చేస్తూ కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుంటున్నాడు ప్రభు.

ఆయనకెందుకో - అరుణే ఆ పరిస్థితిలో ఉన్నట్టు అనిపించి మనస్సు చివుక్కుమంది.

"ఊరుకో! ఇక కళ్లు నలపకు!"-వాడి పక్కన చేరి ఓదార్పుగా భుజం మీద చేయి వేశారు.

రైలు ఏలూరు దాటేసరికి ప్రభు కొంచెం స్థిమిత పడ్డాడు.

ఆ తర్వాత రావుగారూ, రాజ్యం వాణ్ని చాలా ప్రశ్నలడిగారు. వాళ్లిద్దరిలో ఎలాంటి ఆత్మీయత కనిపించిందో మరి, ఆ ప్రశ్నలన్నింటికి ఎంతో ఓపిగ్గా, మరెంతో విపులంగా సమాధానాలు చెప్పాడు ప్రభు.

విజయవాడ దాటిన తర్వాత, తను అప్పర్ బెర్త్ ఎక్కి పడుకున్నాడు.

ఆ తర్వాత రావుగారు నెమ్మదిగా భార్యని అడిగారు -

"వాడు అచ్చం మన అరుణ్‌లాగా లేడూ?"

"నేనూ అదే చెప్పాలనుకున్నాను. కానీ, ఆ ఈడు పిల్లలంతా నీకు అలాగే కనిపిస్తారంటూ తిడతారేమోనని నోరు మూసుక్కూర్చున్నాను!" చెప్పింది రాజ్యం.

మర్నాడు ప్రొద్దున హైదరాబాద్‌లో రైలు దిగిన తర్వాత ప్రభుని అడిగారు రావుగారు-

"చుట్టాలూ, స్నేహితులూ ఉంటే మీ హాస్టల్‌కి వస్తూంటారా?"

"ఓః! ప్రతి ఆదివారం మధ్యాహ్నం రెండు నుంచి అయిదు గంటలదాకా మాకు గెస్టవర్స్. మా ఫ్రెండ్స్ చాలా మందికి వాళ్ల పేరెంట్సూ, రిలెటివ్‌లూ వస్తూంటారు. నా కోసమే ఎవ్వరూ రారు! హైదరాబాద్‌లో నాకెవరూ లేరుగా మరి!"

"ఇక నుంచీ ప్రతి వారం నేను వస్తాన్లే!" అప్రయత్నంగానే అనేశారు రావుగారు.

ప్రభు విస్మయంగా చూశాడు ఆయనవైపు.

"నిజంగా వస్తారా, అంకుల్!" ఆశగా అడిగాడు తర్వాత.

"నిజంగానే వస్తాను, కానీ ఒక్క షరతు! నన్ను అంకులూ, పెంకులూ అని మాత్రం పిలవకూడదు. 'తాతా' అని పిలవాలి!" నవ్వుతూ చెప్పారు.

అంతే!

అప్పటినుంచీ ప్రభు వాళ్లకు బాగా చేరికయ్యాడు. అదలా ఉండగా -

నాలుగైదేళ్ళలో తిరిరి ఇండియా వచ్చేస్తానంటూ వెళ్లిన రాఘవ - అమెరికా జీవన విధానానికి అలవాటుపడి, మరి తిరిగి రాలేక అక్కడే ఇల్లు కట్టుకుని స్థిరపడిపోయాడు. మధ్యలో ఒక్కసారి మాత్రం ఢిల్లీలో ఏదో కాన్ఫరెన్స్ ఉండి వచ్చినప్పుడు, హైదరాబాద్ కూడా 'విజిట్'చేసి, తల్లిదండ్రుల్ని చుట్టం చూపుగా చూసి వెళ్లిపోయాడు. వారానికీ పదిరోజులకీ ఫోన్‌లోనే తల్లిదండ్రుల యోగక్షేమాలు కనుక్కునేవాడు. అప్పుడే అరుణ్ కూడా వాళ్లతో మాట్లాడేవాడు. రాను రాను అరుణ్ పెద్దవుతున్నకొద్దీ ఆ 'మాటలు' కూడా కరువైపోయాయి.

"అరుణ్‌తో ఒకసారి మాట్లాడించరా!" అని రావుగారు రాఘవని అడిగితే, "ఒరేయ్! తాతగారు లైన్‌లో ఉన్నారు. హలో చెప్పు!" అంటూ రాఘవ అరుణ్‌కి రిసీవర్ ఇచ్చేవాడు.

అప్పుడైనా, అరుణ్ ఒక్కమాట - "హలో! గ్రాండ్‌పా! ఎలా ఉన్నావు?" అనేవాడు. అంతే!

"నిన్ను చూడాలని నేనూ, నానమ్మా రోజూ తలచుకుంటున్నాంరా!" అని ఎప్పుడైనా రావుగారు మాటవరసకి అన్నప్పుడు -

"ఎలాగూ రిటైరైపోయావుగా! నువ్వూ, బామ్మా అమెరికా వచ్చేయండి. డాడీ మీకు టిక్కెట్ పంపుతారు!" అనేవాడు.

ఆ మాటకే మురిసిపోయేది రాజ్యం.

ఈ పదిహేనేళ్లుగా అరుణ్ వాళ్లకు ఎంత దూరమైపోయాడో, ప్రభు అంతదగ్గరయ్యాడు.

వారంవారం రావుగారు హాస్టల్‌కి వెళ్లి ప్రభుతో ఓ గంట కాలక్షేపం చేసేవారు. అప్పుడప్పుడు వార్డెన్ పర్మిషన్ తీసుకుని ఇంటికి తీసుకొచ్చేవారు. అలాంటి సందర్భాల్లో రాజ్యం కూడా ఎంతో మురిసిపోయేది. ఒక్కొక్కసారి ప్రభు సెలవల్లో తన ఊరు వెళ్లటం మానేసి, వాళ్లతోనే గడిపేవాడు.

★ ★ ★

"నమస్తే తాతగారూ!"

పేపరు లోంచి తల ఎత్తి చూశారు రావుగారు. ఎదురుగా వీధి గుమ్మంలో ప్రభు నిలబడి ఉన్నాడు. తెల్లటి ప్యాంటు మీద గోధుమరంగు షర్టు వేసుకున్నాడు. మెడలో బంగారు గొలుసు మెరుస్తోంది. పెదవులపై చిరునవ్వు, కళ్లల్లో ఆత్మీయతా కనిపిస్తున్నాయి.

అతని పక్కనే ఓ అందమైన అమ్మాయి!

"రా, శ్వేతా! నే చెప్పలేదూ, హైదరాబాద్‌లో నాకో తాతగారున్నారనీ? ఈయనే! నిజం చెప్పాలంటే ఈయన నాకు గ్రాండ్‌ఫాదర్ కంటే ఎక్కువ! గాడ్‌ఫాదర్ లాంటివారు! నమస్కారం పెట్టు!" అంటూనే ఆమెను రావుగారి దగ్గరకు తీసుకొచ్చాడు.

"నమస్తే!" ఆ అమ్మాయి చేతులు జోడించింది.

రావుగారు మాత్రం వాళ్లిద్దరి వైపూ అలాగే కళ్లార్పకుండా చూస్తున్నారు.

"ఏం తాతగారూ! బాగున్నారా? మీ ఆరోగ్యం ఎలా ఉంటోంది?" ఆయనకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అడిగాడు ప్రభు.

ఈలోగా వంటింట్లోనుంచి రాజ్యం వచ్చింది.

"ఏం బాబూ! బావున్నావా?" ఆప్యాయంగా పలకరించింది.

"బాగానే ఉన్నాను, నానమ్మగారూ! కానీ మీ ఇద్దరి మీదా నాకు చాలా కోపంగా వుంది. అసలు మీ ఇంటికి రాకూడదనీ, తాతగారితో ఇంకెప్పుడూ మాట్లాడకూడదనీ అనుకున్నాను, తెలుసా?" - చిరుకోపం ప్రదర్శిస్తూ అన్నాడు ప్రభు.

రావుగారికి విషయం బోధపడింది.

"నాకు తెలుసురా, ప్రభూ! నీకు కోపం రావటం సహజమే! కానీ సరిగ్గా నీ పెళ్లి ముహూర్తం సమయానికే ఈ మహాతల్లి జ్వరంతో మంచం ఎక్కింది!" - చెప్పారాయన.

"అయితే ఏమైందట? నేను మిమ్మల్ని వెళ్లిరమ్మన్నానుగా! మీరేమో అంత దూరం

ప్రయాణం చేయలేనంటిరి!" వెంటనే అసలు నిందనంతా భర్తమీదకు తోసేసింది రాజ్యం.

"నిజమేరా, ప్రభూ! ఆ మాటా నిజమే! నలభై ఏళ్ళ మా కాపురంలో ఎక్కడికి వెళ్లవలసి వచ్చినా, మేమిద్దరం కలసే వెళ్లేవాళ్లం, కలిసే వచ్చేవాళ్లం. ఇప్పుడు ఈవిడగారు వెంటలేకుండా ఈ హైదరాబాదు నుంచి ఆ విశాఖపట్నం ఒంటరిగా రావాలంటే భయం వేసింది. అసలే బీ.పీ. మనిషిని కదా!" సంజాయిషీ యిచ్చుకున్నారాయన.

ఆ జవాబు విన్న ప్రభు మెత్తబడ్డాడు.

"అందుకే మా శ్రీమతిగారిని మీకు చూపించాలని మా హనీమూన్ ట్రిప్పు ముందుగా ఈ హైదరాబాదుతో ప్రారంభించాం. ఇదిగో, 'ఈవిడే' మా ఆవిడ! శ్వేత!" అంటూ ఆమెను మరోసారి వాళ్లిద్దరికీ పరిచయం చేశాడు.

"అమ్మాయి నీకంటే అందంగా ఉందోయ్!" అంది రాజ్యం. ఆ పిల్లవైపు మెరిసే కళ్లతో చూస్తూ.

"అందుకే కదా - నయాపైసా కట్నం లేకుండా చేసుకున్నాను" చెప్పాడు ప్రభు గర్వాంగా.

"చాల్లే ఊరుకో! సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మిలాంటి పిల్ల నీ చేయి పట్టుకుని వెంట నడిచొచ్చింది. అది చాలక, ఇంకా కట్నం కావాలా?" చిరుకోపం ప్రదర్శించింది రాజ్యం.

"నాకు మాత్రం ఏం తక్కువ నానమ్మగారూ! ఆరడుగుల అందగాణ్ణి. అరవై లక్షల ఆస్తికి వారసుణ్ణి, హైక్లాసు ఫామిలీకి చెందినవాణ్ని, ఎం.బి.బి.ఎస్. చది[illegible]నవాణ్ని. నాకంటే మంచిమొగుడు ఈవిడగారికి దొరుకుతాడా?" - భార్యవైపు కొంటెచూపులు విసురుతూ అడిగాడు.

"మరి నీకు అవన్నీ ఉండగానే, ఇంకా కట్న కానుకలకు ఆశపడ్డావా, నాయనా! సిగ్గు లేకపోతే సరి!" - అంది రాజ్యం.

ప్రభు ఏం జవాబు చెప్పేవాడో కానీ, ఈలోగా శ్వేత అంది - "కట్న కానుకలంటూ తీసుకోలేదన్న మాటేగానీ, గొంతెమ్మకోరికలు చాలానే కోరారు మామ్మగారూ! మా నాన్నగారికి పెళ్లిఖర్చే రెండు లక్షలు దాటింది!"

ఆ మాటలకు ప్రభు దెబ్బతిన్నట్టు చూశాడు.

వాళ్లిద్దరినీ చూసి రావుగారూ, రాజ్యం హాయిగా నవ్వుకున్నారు.

ఆ తర్వాత ప్రభు రావుగారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. ఈ లోగా రాజ్యం కాఫీ తయారు చేసి తెచ్చింది.

"నిన్నుచూస్తే అణువణువునా మా అరుణ్‌ని చూసినట్టే ఉందయ్యా, ప్రభూ!" కాఫీ తాగుతున్న ప్రభువైపు తదేకంగా చూస్తూ చెప్పింది రాజ్యం.

"అవును, నానమ్మగారు! తాతగారు కూడా చాలా సార్లు ఆమాటే అనేవారు. ఇంతకీ మీ మనవడు ఈ మధ్య అమెరికా నుంచి వచ్చాడా?" అడిగాడు.

రాజ్యం తల వంచుకుంది. బహుశా కన్నీళ్లను దాచుకునే ప్రయత్నమేమో - రావుగారికి తెలియలేదు. అప్పుడు ఆయనే బదులు చెప్పారు -

"ఇదిగో, 'ఈ ఏడు వస్తానూ, వచ్చే ఏడు వస్తానూ' అంటూ ఇప్పటికి పదిహేనేళ్లుగా రానేలేదు. ఫోనులో మాట్లాడుకోవటం, ఫోటోల్లోనే చూసుకోవటం! ఇవే మాకు మిగిలాయి."

మరో గంట తర్వాత ప్రభు లేచాడు.

"ఇక మేం వెడతాం, తాతగారూ! ఇక్కడే గోల్కొండ హోటల్లో దిగాం. ఇవాళా, రేపూ సిటీలో తిరిగి, ఎల్లుండి మైసూరు వెడతాం" అన్నాడు.

రాజ్యం లోపలకు వెళ్లి చీరా, జాకెట్టుగుడ్డా తీసుకొచ్చింది. శ్వేత నుదుట కుంకుమ పెట్టి ఆ బట్టలు ఆమె చేతుల్లో ఉంచింది.

"ఇప్పుడు ఇవన్నీ ఎందుకు మామ్మగారూ!" మొహమాటపడింది శ్వేత.

"కట్టుకో, తల్లీ! నువ్వు మాకు పరాయిదానివి కాదు. ప్రభు కూడా మా అరుణ్ లాంటి వాడే! అప్పుడు నువ్వు నాకు మనుమరాలివే అవుతావు కదా!"

అంతవరకూ బలవంతంగా అణచుకున్న కన్నీటిని మరి దాచుకోలేక పోయింది రాజ్యం.

"మరి వస్తాం తాతగారూ! మళ్లీ నాలుగైదు నెలల్లో వస్తాంలెండి! ఈ లోగా మీ మనవడికి పెళ్లి సెటిలై, ఇండియా వస్తే మాత్రం ఉత్తరం రాయండి. అతను అచ్చం నాలాగా ఉంటాడన్నారుగా. అతన్ని చూడటానికైనా నేను తప్పకుండా వస్తాను!!" - ఆటో ఎక్కిన తర్వాత అన్నాడు ప్రభు.

"అలాగే, చూద్దాం! వెళ్లిరండి!" అన్నారు రావుగారు చెయ్యి ఊపుతూ.

కానీ -

అరుణ్ అమెరికాలోనే ఓ పిల్లని ప్రేమించి, ఈమధ్యనే పెళ్లిచేసుకుని అమెరికా పౌరసత్వం సంపాదించుకున్న విషయాన్ని ఆయన ఎందుకో ప్రభుకి చెప్పలేకపోయారు.

అలాగే -

ఆమధ్య 'కంచి' వెళ్లినప్పుడు - 'త్వరలో అరుణ్‌కి ఎలాగూ ఇండియాలోనే పెళ్లి

జరుగుతుంది కనుక, అప్పుడు వాడి భార్యకి పెట్టాలనే కొండంత కోరికతో కొన్న కంచిపట్టు చీరనే శ్వేతకు పెట్టిన విషయాన్ని' రాజ్యం కూడా చెప్పలేక పోయింది.

అయితే -

ఆ రాత్రి రావుగారు రాజ్యంతో ఒక్క మాట మాత్రం అన్నారు -

"మనం కూడా అమెరికా వెళ్లిపోదామోయ్!" అని.

*(ఆంధ్రప్రభ - వారపత్రిక 29-11-95)*

★ ★ ★